

రాజంపేట నుంచి హాస్టల్ గడ్డ ఈద్గా వరకు రూ. 2కోట్లతో సీసీరోడ్డు

రాజంపేట ఫిల్టర్ బెడ్‌లో సీసీ రోడ్డు, లైటింగ్ ఏర్పాటు

సెప్టెంబర్ 10 వరకు పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికారులకు సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులపై స్థానిక మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. అధికారులను అడిగి సమస్యలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. రాజంపేట చౌరస్తా నుంచి ఈద్గా వరకు సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఫిల్టర్ బెడ్‌లో ఎల్లప్పుడూ వెలుతురు ఉండేలా ప్రత్యేకంగా స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పనులకు రూ2 కోట్లు అవసరం ఉంటుందని అధికారులు జగ్గారెడ్డికి వివరించారు. ఈ పనులను మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా చేపట్టేలా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నుంచి వేరే ఫండ్ వచ్చినప్పుడు జనరల్ ఫండ్‌కు సర్దుబాటు చేసేందుకు కలెక్టర్, అదనపు కలెక్టర్ అనుమతి కోరాలని మున్సిపల్, పబ్లిక్‌హెల్త్ విభాగాల అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రఘు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, నాయకులు కూన సంతోష్ కుమార్, మహేష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద గతుకులమయంగా మారిన రోడ్డు

అడుగడుకో గుంత

అధ్వానంగా రోడ్లు 7
వాహనదారులకు తప్పని అవస్థలు
మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

జీహెచ్‌ఎం పదోన్నతులు పూర్తి

నేటి నుంచి ఎస్జీటీల ప్రమోషన్లపై కసరత్తు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఈ నెల 11 వరకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా, కొందరు హైకోర్టులో ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచింది. తాజాగా న్యాయస్థానం స్టే తొలగించడంతో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు జీహెచ్‌ఎం పదోన్నతులపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 9 గంటల వరకు ఎస్ఏలకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. వీరికి జోనల్ స్థాయిలో పదోన్నతులు కల్పించనున్నారు. ఇప్పటికే జోనల్ స్థాయిలో ఉన్న జీహెచ్‌ఎంల ఖాళీల వివరాలు, పదోన్నతి అర్హులైన ఎస్ఏల సీనియారిటీ జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. సంగారెడ్డి జిల్లాలో 34 జీహెచ్‌ఎం ఖాళీలు ఉన్నాయి. కాగా ఎస్ఏలు పెట్టుకున్న వెబ్ ఆప్షన్ల ఆధారంగా గురువారం రాత్రి జీహెచ్‌ఎంల పదోన్నతుల ఉత్తర్వులు వెలువడనున్నాయని విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి.

యాప్ లింక్ పంపి.. రూ. 25 లక్షలు టోకరా

మనోహరాబాద్, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్‌లో ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ఒకరు రూ. 25 లక్షలు పోగొట్టుకున్నాడు. తుప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు.. మెదక్ జిల్లా తుప్రాన్‌కు చెందిన వ్యాపారికి వాట్సాప్‌లో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని మేసేజ్ వచ్చింది. దీంతో పాటే ఓ యాప్ లింక్ కూడా వచ్చింది. దీంతో వ్యాపారి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. రూ. 25 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాడు. తొలుత లాభాలు చూపించగా, తర్వాత డబ్బులు డ్రా చేసుకుందామంటే వీలు కాలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తుప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు.

కాగితాల్లోనే స్టాక్.. దుకాణాల్లో నిల్

యూరియా కొరతపై విరుద్ధ వాదనలు

- డిమాండ్ 26 వేల మెట్రిక్ టన్నులు..
- సరఫరా 19 వేల మెట్రిక్ టన్నులు
- ఆగస్టు వరకు సరిపోతుందని అధికారుల ప్రకటనలు
- యూరియా కోసం రైతుల పోరాటం
- సొసైటీల వద్ద రైతుల బారులు



చిన్నశంకరంపేట: మడూర్ సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మెదక్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురియడంతో పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. వర్షంలో తడస్తూనే ఎరువుల కోసం లైన్లలో నిల్చుంటున్నారు. డిమాండ్‌కు సరిపడినంత అందుబాటులో లేకపోవడంతో కొందరు వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తున్నారు. మరి కొందరు గుళికలు, పురుగుమందులు కొంటేనే యూరియా ఇస్తామని అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో 3.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనాలు రూపొందించిన అధికారులు ఇందుకు తగినట్లు కార్యాచరణ సిద్ధం చేశారు. అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉందని ప్రకటించారు. కానీ, ఈ సీజన్‌లో 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 19 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు చేరుకోవడంతో కొరత ఏర్పడింది.

కొరత లేదంటున్న అధికారులు

అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదని చెబుతున్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ పలుసార్లు ప్రకటనలు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి దేవ్ కుమార్ సైతం యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పంటలకు యూరియా వాడతారని, ప్రస్తుతానికి జిల్లాకు దిగుమతి అయిన యూరియా సరిపోతుందని చెబుతున్నారు. మిగిలిన ఏడు వేల మెట్రిక్ టన్నులు త్వరలోనే వస్తాయని వివరించారు.

సహకార సంఘాల వద్ద బారులు

యూరియా కోసం సహకార సంఘాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. బస్తా యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిలబడినా ఉత్తి చేతులతో వెనుదిరగాల్సి వస్తోంది. కొరత లేకపోతే మేమెందుకు కష్టాలు పడాల్సి వస్తోందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని అనుమానాలు కలుగుతున్నాయి. కొందరు డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి మార్కెట్ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కేంద్రం నుంచి యూరియా పంపిణీ ఆలస్యం అవుతుండమే సమస్యకు మూలమని మరో వాదన వినిపిస్తున్నది.

తగ్గని ఆందోళనలు

నర్సాపూర్/శివ్వంపేట/చిన్నశంకరంపేట/చిలప్‌చెడ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో యూరియా కోసం రైతులు రాస్తారోకో చేశారు. దీంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌జాం ఏర్పడటంతో ఎస్ఐ లింగం సిబ్బందితో చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి పీఏసీఎస్ వద్దకు యూరియా వస్తుందని చెప్పడంతో రైతులు అక్కడికి వెళ్లారు. అనంతరం పీఏసీఎస్ వద్ద నిరీక్షిస్తున్న రైతులను ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిసి మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 560 సంచుల యూరియా లోడ్ కావడంతో అంతకుముందే టోకెన్లు తీసుకున్న రైతులకు పంపిణీ చేశారు. మిగిలినవారు ఉత్తి చేతులతో వెనుదిరిగారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ చౌరాస్తా వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే ధర్నాలో పాల్గొన్నారు. ఎకరాకు ఒకే యూరియా బస్తా ఇస్తే ఏం సరిపోతుందని

మిగతా 8వ పేజీలో



హైవే 765-డీ విస్తరణకు మోక్షం

మెదక్ వరకు నాలుగు లేన్లుగా మార్పు.. ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం

నర్సాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ ఉన్న 765-డీ జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. తరచూ ప్రమాదాలతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న ఈ రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయం

హైదరాబాద్ సమీపంలోని గండిమైసమ్మ సమీపంలోని రింగురోడ్డు నుంచి మెదక్ వరకు రోడ్డును 2017-18లో జాతీయ రహదారిగా గుర్తించి రూ.400 కోట్లతో విస్తరించారు. హైవే 765-డీ అని పేరు పెట్టారు. రింగురోడ్డు నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు 15 కిలోమీటర్ల మేర మాత్రమే వంద అడుగులతో నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించారు. అక్కడి నుంచి మెదక్ వరకు 48 కిలోమీటర్ల మేర పలుచోట్ల అటవీ ప్రాంతం ఉండటంతో అనుమతులు రాకపోవడంతో రోడ్డును రెండు లేన్లుగానే ఉంచుతూ పది మీటర్ల వెడల్పుతో విస్తరించారు. పేరుకు జాతీయ రహదారిగా గుర్తించినా ఇరుకుగా, ప్రమాదకరమైన మలుపులతో, మధ్యలో డివైడర్ లేకుండా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో నిరంతరం వాహనాల రద్దీ ఉంటుంది. ఆదివారాల్లో మరింత ఎక్కువ ట్రాఫిక్ ఉండడంతో ప్రమాదాలు పెరిగిపోయాయి. పరిస్థితిని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. ఎంపీ విన్నపం మేరకు దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ఈ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ వల్ల జరగబోయే నష్టాన్ని అంచనా వేసి, దానికి తగిన నష్టపరిహారం చెల్లించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విస్తరణ పూర్తయితే హైవే పై ప్రయాణం సురక్షితంగా మారనుంది.

అ(ఆ)టో.. ఇటో అయితే..!



వారంతా ప్రైవేట్ పాఠశాలలో ప్రాథమిక తరగతులు చదివే విద్యార్థులు. వివిధ ప్రాంతాల నుంచి రోజూ స్కూల్‌కు వారి తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆటోలో పంపిస్తారు. ఆ ఆటో డ్రైవర్ దానిని పుష్పక విమానం అనుకున్నాడో ఏమో.. ఒకే ఆటోలో సుమారు 25 నుంచి 28 మంది విద్యార్థులను ఒకరిమీద ఒకరిని ఎక్కించుకుని తీసుకెళ్తున్నాడు. ఆ ఆటో అటో.. ఇటో అయితే ఏమిటని? అధికారులు.. కనీసం స్కూల్ యాజమాన్యం అయినా గమనించడంలేదా అని చూసిన వారు వాపోతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



వినియోగదారుడా
మేలుకో

కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యత, సేవల్లో లోపంపై చింత వద్దు
వినియోగదారుల రక్షణ చట్టంతో చర్యలు తీసుకునే అవకాశం
అవగాహనతోనే మోసాలకు చెక్ 6



జిన్నారంలో సివిల్ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయవాదులు, నాయకులు

24న జిన్నారంలో కోర్టు ప్రారంభం

హాజరు కానున్న హైకోర్టు న్యాయమూర్తులు

జిన్నారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని ఈ నెల 24న హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించనున్నట్లు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన కోర్టు భవనాన్ని గురువారం ఆయన మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. హైకోర్టు న్యాయమూర్తులు సూరేపల్లి నంద, అనిల్‌కుమార్ జూకంటి కోర్టును ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా న్యాయధికారి భవానీచందర్, బార్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొంటారని వెల్లడించారు. ఇక్కడ కోర్టు ప్రారంభం కావడంతో జిన్నారం, హత్నూర, గుమ్మడిదల మండలాల ప్రజలకు న్యాయసేవలు చేరువవుతాయని పేర్కొన్నారు.

పల్లెలు మురిసేలా.. పనుల జాతర

నేడు మెదక్ జిల్లాలోని 492 గ్రామాల్లో ప్రారంభం

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పల్లెల్లో పనుల జాతర కార్యక్రమం చేపట్టనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల ద్వారా చేపట్టబోయే కొత్త పనులను ఏకకాలంలో ప్రారంభించటానికి 'పనుల జాతర-2025' కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా కొత్త పనులకు భూమి పూజ చేయడంతో పాటు గతంలో పూర్తయిన పనులను ప్రారంభిస్తారు. కొత్త పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. జిల్లా వ్యాప్తంగా 492 గ్రామాల్లో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

ఇప్పటికే పూర్తయిన పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర అభివృద్ధి పనులను నేడు ప్రారంభించనున్నారు. అవసరమైన గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్లు, గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేస్తారు. ఇందిరా మహిళాశక్తి- ఉపాధి భరోసా, కింద చేపట్టే జీవనోపాధి కార్యక్రమాలు, మహిళా సంఘాలకు పశువులు, గొర్రెలషెడ్లు, కోళ్లు, వ్యవసాయ బావుల నిర్మాణంతోపాటు పండ్ల తోటల పెంపకం వంటి పనుల మంజూరు ప్రతాలను అందజేస్తారు. ఫల వనం.. వనమహోత్సవం కింద ఈత, తాటిఇ, పండ్లతోటల పెంపకం చేపట్టే లబ్దిదారులను గుర్తిస్తారు.

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేక కొన్నాళ్లుగా పల్లెపాలన ఎక్కడా వేసినా గొంగడి అక్కడే అన్నట్టుగా తయారైంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పల్లెల్లో కొత్త పనులు ప్రారంభించేందుకు.. పాత పనులను పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు బాటలు పడనున్నాయి.

బదిలీలల రూటే సప'రేటు'

- నిబంధనలు తుంగలోకి తొక్కి ట్రాన్స్‌ఫర్లు
- శివారు పంచాయతీల్లో పోస్టింగ్‌కు డిమాండ్
- నూతన మున్సిపాలిటీల్లోకి మారాలంటే రూ. లక్షలు ఇచ్చుకోవాల్సిందే



పటాన్‌చెరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లోకి బదిలీల కోసం అధికారులు లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. హైదరాబాద్ నగర శివార్లలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శలున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉద్యోగం చేస్తే ఇంటి అద్దె అలవెన్స్ 30 శాతం వస్తుంది. అలాగే హైదరాబాద్‌కి దగ్గరగా ఉండటం వల్ల ఇతర సదుపాయాలు లభిస్తాయి. దీంతో ఈ ప్రాంతంలో పోస్టింగ్ కోసం రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. జిల్లా స్థాయి అధికారి ఒకరు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సమాచారం.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

నిబంధనల ప్రకారం, ప్రసూతి సెలవుల తర్వాత ఉద్యోగి అదే పోస్ట్‌లో కొనసాగాలి. కానీ, అధికారులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ, గర్భిణులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. ఒక కార్యదర్శి ప్రసూతి సెలవుల తర్వాత తిరిగి విధుల్లో చేరడానికి ప్రయత్నిస్తే, ఆమె స్థానంలో మరొకరిని నియమించారు. ఆమె ప్రతిఘటించడంతో ఆమెకు అదే పోస్టు తిరిగి ఇచ్చారు. మరో మున్సిపాలిటీ పరిధిలోని మహిళా కార్యదర్శిని మాత్రం ప్రసూతి సెలవుల తర్వాత ప్రాధాన్యత లేని గ్రామానికి బదిలీ చేశారు.

లక్షల రూపాయల వసూళ్లు

నారాయణఖేడ్, న్యాల్‌కల్, జహీరాబాద్, ఆందోల్ ప్రాంతాల్లో పని చేస్తున్న నలుగురు కార్యదర్శుల నుంచి భారీగా డబ్బులు తీసుకొని, వారికి నచ్చిన ప్రాంతాలకు బదిలీలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఒక కార్యదర్శి తనకు కావాల్సిన గ్రామం కోసం పదిసార్లు అభ్యర్థించడంతో రూ.20 లక్షలు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఓ కీలక నాయకుడికి బాగా తెలిసిన కార్యదర్శి నుంచి కూడా బదిలీ కోసం డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తున్నది. ఈ అక్రమ వసూళ్లకు మండల స్థాయి అధికారులు కూడా సహకరిస్తున్నారని సమాచారం.

అక్రమార్కులకు అండ

భవనాల అనుమతులు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు, వెంచర్ల విషయంలో స్థానిక అధికారులు కొందరు

మిగతా 8వ పేజీలో

సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం 'ఉల్లాస్'

వయోజన విద్య ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

కల్హేర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి కోరారు. కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయులు, ఐకేపీ, వీవోఏల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో బాగంగా నిరక్షరాస్యుల వివరాలు పొందుపర్చడం జరిగిందని, ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి కుటుంబం వంద శాతం అక్షరాస్యత కలిగి ఉండటమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు.

వినియోగదారుడా మేలుకో



వస్తువుల నాణ్యత.. సేవల్లో లోపంపై చింత వద్దు

వినియోగదారుల రక్షణ చట్టంతో చర్యలు.. అవగాహనతో మోసాలకు చెక్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల రక్షణ చట్టం గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మోసపోతున్నారు. మూడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న వినియోగదారుల రక్షణ చట్టం 1986ను రద్దు చేసి, దాని నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2019లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా దుకాణాల్లో నాణ్యత లేని వస్తువులను విక్రయించినా, అసాధారణ ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించినా కేసులు నమోదు చేయడానికి అవకాశం ఉంది. తూనికలు, కొలతల్లో మోసాలు, ముద్రిత ధర కంటే ఎక్కువ వసూలు చేయడం, నకిలీ వస్తువుల విక్రయాలు పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. నకిలీ విత్తనాలు, ఎరువులు కొని రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎలా నష్టపోతున్నారంటే..

వస్తువుల నాణ్యతలో లోపాలు, ప్యాకేజీపై ముద్రించిన ధర కంటే ఎక్కువ వసూలు చేయడం, పరిమాణం తక్కువగా ఉండటం, వ్యాపారులు అవలంబించే నిర్బంధ పద్ధతుల వల్ల వినియోగదారులు నష్టపోతున్నారు. ఇలాంటి సందర్భాలతో పాటు మెడికల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్యుత్, రియల్ ఎస్టేట్, పోస్టల్, చిట్‌ఫండ్, రవాణా, కొరియర్ సర్వీస్, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో సరైన సేవలు అందకపోయినా ఈ చట్టం ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రశీదుల విషయంలో జాగ్రత్త అవసరం

వినియోగదారుల రక్షణ చట్టంపై సరైన ప్రచారం లేకపోవడంతో వ్యాపారులు చాలామందిని మోసం చేస్తున్నారు. ఏ వస్తువు విక్రయించినా ఒరిజినల్ రశీదు ఇవ్వాలి. కానీ చాలామంది డూప్లికేట్ రశీదులు ఇస్తున్నారు. వస్తువులో నాణ్యత లోపిస్తే, డూప్లికేట్ రశీదుల కారణంగా పరిహారం పొందలేకపోతున్నారు. అందుకే, ఏ వస్తువు కొనుగోలు చేసినా దాని యాజమాన్యం నుంచి తప్పకుండా ఒరిజినల్ రశీదు తీసుకోవాలి. అలాగే తక్కువ ధరకు లభిస్తుందనే ఉద్దేశంతో కొందరు రశీదు లేకుండానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వస్తువులో లోపం ఉన్నప్పుడు, రశీదు లేని కారణంగా సరైన న్యాయం లేదా నష్టపరిహారం పొందలేకపోతున్నారు.



కమిషన్‌లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైనవి	పరిష్కారమైనవి	పెండింగ్‌లో
2022	86	86	0
2023	102	98	4
2024	137	96	41
2025	112	14	98

సత్వర పరిహారం కోసం కృషి



సమాజంలో వినియోగదారుడు అడుగడుగునా మోసపోతున్నాడు. వారికి జరిగిన నష్టానికి పరిహారం అందించేందుకు మా కమిషన్ కృషి చేస్తుంది. వినియోగదారులు ఎలాంటి ఖర్చు లేకుండా కమిషన్ కార్యాలయాన్ని సంప్రదించి పరిహారం పొందవచ్చు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్యుత్, విద్యా సంస్థలు, షాపింగ్‌మాల్, మెడికల్, పోస్టల్, చిట్‌ఫండ్, రవాణా, కొరియర్ సర్వీస్, వ్యవసాయ రంగాల్లో లోపాలు జరిగినట్లయితే మా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. అంతేకాకుండా, టీవీలు, పత్రికల్లో అసాధారణ ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించినా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. వినియోగదారులు పోస్టు ద్వారా కూడా తమ ఫిర్యాదును పంపవచ్చు.

- ఎస్.జయశ్రీ, చైర్మన్, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, సంగారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా

ఫిర్యాదు చేయాలంటే..

సంగారెడ్డి పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణం ఆవరణలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయం ఉన్నది. ఉమ్మడి జిల్లా చైర్మన్ ఇక్కడే ఉంటారు. ఈ కార్యలయంలో కేసును ఫైల్ చేయొచ్చు.

న్యాయం చేయాలని నిర్వాసితుల ఆందోళన

● గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

గజ్వేల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామ ప్రజలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. తమ గ్రామానికి చెందిన అరికెల చంద్రం ఇంటిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారని, ఆ ఇంటికి మరమ్మతుల కోసం ఖర్చు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించాలని ఆందోళన చేపట్టారు. గతంలో తమ కోసం ధర్నాలు, నిరసనలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ న్యాయం జరగలేదని గ్రామ మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 95 శాతం పరిహారం, ప్యాకేజీ, ఇళ్లు మంజూరు చేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం చేయాల్సిన మిగిలిన 5 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోతోందని మండిపడ్డారు. అధికారులు ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం చేస్తున్నారని, అరికెల చంద్రంకు ఎలాంటి ఆధారాలు లేవని ఖాళీ చేయించారని, కానీ అదే గ్రామానికి చెందిన రాధాకిషన్‌కు రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో ఇళ్లు కట్టుకుంటుంటే అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని రెండు రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామస్థులు

అదృశ్యం కేసు నమోదు

అధికారుల వేధింపుల కారణంగానే తన కుమారుడు అరికెల చంద్రం (38) అదృశ్యమయ్యాడని అతని తండ్రి బాలయ్య గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితుడిగా తమకు తాత్కాలికంగా కేటాయించిన ఇంటి నంబర్ 162కు చంద్రం దాదాపు రూ.11.50 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించాడని బాలయ్య తెలిపారు. ఈ ఖర్చును ఇప్పించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని, పైగా ఆ ఇంటిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి బలవంతంగా ఖాళీ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఐ ఫిర్యాదుతో చంద్రంపై కేసు నమోదు

అధికారులను బెదిరించినట్లు గజ్వేల్ ఆర్ఐ కృష్ణ ఫిర్యాదు మేరకు అరికెల చంద్రంపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లోని ఇంటి నంబర్ 162కు మధుసూదన్‌రెడ్డికి ప్రభుత్వపరంగా రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ, అరికెల చంద్రం అక్రమంగా ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారని ఆర్ఐ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటిని ఖాళీ చేయమని కోరితే, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్ గదిలో డీజిల్ పోసుకుని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

చిన్నకోడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఓ యువకుడు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. బాధితుడు ముష్మిరి రాజు కథనం ప్రకారం, గోనెపల్లిలో తమ కుటుంబానికి వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. 2004-05లో రెవెన్యూ అధికారుల తప్పిదంతో భూమి దాయాదుల పేరిట నమోదైంది. అప్పటినుంచి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాడు. సిద్దిపేట జూనియర్ సివిల్ కోర్టులో కేసు నడుస్తోంది. అయితే, ఇటీవల దాయాదులు ఆ భూమిని వారి కుమారులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ స్లాట్‌ను నిలిపివేయాలని కోరుతూ రాజు ఈ నెల 14న తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించాడు. గురువారం రిజిస్ట్రేషన్ జరుగుతోందని తెలిసి కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. తర్వాత వెంట తెచ్చుకున్న డీజిల్ బాటిల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సైఫ్ అలీ వచ్చి అతడిని సముదాయించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పుల్‌కల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్ విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న మిన్‌పూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సింలు(34) సింగూరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కాడు. స్వగ్రామానికి వెళ్లే క్రమంలో డ్రైవర్, కండక్టర్‌కు సమాచారం ఇవ్వకుండానే అకస్మాత్తుగా బస్సు దిగుతూ కిందపడ్డాడు. ఈ ఘటనలో నర్సింలు కాళ్లకు, పొత్తికడుపునకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి దత్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాత్రివేళ దుకాణాల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను సిద్దిపేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 12న సిద్దిపేట పట్టణ పరిధిలో రెండు చోట్ల మెడికల్‌షాప్‌ల్లో దొంగతనం జరిగింది. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా టూటౌన్ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి సూర్య, మహమ్మద్ ఆరీఫ్, తొగుట మండలం గుడికందులకు చెందిన బాణాపురం సుభాష్, పటాన్‌చెరుకు చెందిన సాజిద్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఒక సెల్‌ఫోన్, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు.

ఇరిగిపల్లిలో బోరుమోటారు వైర్ల చోరీ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గత మూడు రోజులుగా రైతుల పంట పొలాల్లోని బోరుమోటారు వైర్లను దొంగిలిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల్లో 20 మోటార్ బోర్లు, సోలార్లకు చెందిన వైర్లు చోరీకి గురైనట్లు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూర్ఛతో పొలంలో పడి వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో మూర్ఛ వ్యాధితో వరి పొలంలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని సిద్దిపేట పట్టణం, శ్రీనగర్ కాలనీకి చెందిన తంగళ్లపల్లి నర్సింహచారి (50)గా గుర్తించారు. ఆయన వృత్తిరీత్యా స్వర్ణకారుడు. నర్సింహచారి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో 19న కుటుంబసభ్యులు సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం నర్సింహచారి మృతదేహం వరి పొలంలో లభ్యమైంది.



బురదమయంగా ఝరాసంగం మండలంలోని పూర్యానాయక్ తండా రోడ్డు



గుంతలమయంగా కంది మండలం బ్యాతోల్‌కు వెళ్లే రోడ్డు



పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం వెళ్లే రోడ్డు

అడుగడుకో గుంత

అధ్వానంగా ఉమ్మడి జిల్లా రోడ్లు
వాహనదారులకు తప్పని అవస్థలు
మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

అల్లాదుర్గం/కంది/నారాయణఖేడ్/ఝరాసంగం/నర్సాపూర్/పటాన్‌చెరు/చేర్యాల/కొమురవెల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రోడ్లు అతలాకుతలమయ్యాయి. సాధారణ గతుకులే కాదు, అడుగుకో గుంతతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనదారుల ప్రాణాలకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి, వాటి లోతు తెలియక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

వివిధ ప్రాంతాలలో దుర్భర పరిస్థితి

● కంది మండలంలోని బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తండా, కొయ్యగుండు తండాతో పాటు ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ బైపాస్ రోడ్డు, ఎర్దనూర్, ఉత్తర్‌పల్లి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కలివేముల నుంచి మక్తఅల్లూర్ వెళ్లే రోడ్డు బురదమయంగా మారి ప్రయాణం కష్టంగా మారింది. కంది మండల కేంద్రంలోని సాయి, విజ్ఞాన్, శ్రీనిధి కాలనీల్లో రోడ్లు చినుకుపడితే బురదగా మారుతున్నాయి.

● నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీచౌక్, వెంకటరెడ్డి చౌక్, చాంద్‌ఖాన్‌పల్లి చౌరస్తా, మంగల్‌పేట బైపాస్ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్లపై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. నారాయణఖేడ్ - జగన్నాథ్‌పూర్, పిప్రి - మనూరుల మధ్య జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నా, గుంతలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

● ఝరాసంగం మండలంలోని పుర్యానాయక్‌తండా, ఏడాకులపల్లి రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఏడాకులపల్లి నుంచి కోహీర్ చౌరస్తా వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్డు గతుకులమయంగా మారింది. ఈ రోడ్డు గుండా జీర్లపల్లి, చీలమామిడి, బోరెగావ్, ఇస్లాంపూర్ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచి, వాటిని గుర్తించడం కష్టంగా మారింది. కక్కర్‌వాడ నుంచి పూర్యానాయక్‌తండా వరకు రోడ్డు నిర్మాణం కోసం ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా రూ.2.38 కోట్లు మంజూరైనా, కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వర్షాలకు రోడ్డంతా దెబ్బతింది.





కోతకు గురైన అల్లాదుర్గం ప్రధాన రోడ్డు, రహదారిపై గుంతలు, పారుతున్న వరదనీటితో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

● పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ రహదారి గుంతలమయంగా మారింది. ఇంద్రేశం నుంచి ఆరు కిలోమీటర్ల మేర మోకాల్లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● అల్లాదుర్గం మండలంలో వర్షాలకు చెరువులకు గండ్లు పడటంతో అల్లాదుర్గం రహదారిపై బట్టికుంట చెరువు గండితో నీరు ప్రవహిస్తోంది. రోడ్డుపై నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారి ఇరువైపులా పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ముస్లాపూర్ గ్రామ సమీపంలోని ముస్లాపూర్-బహిరన్‌దిబ్బ ప్రధాన రహదారి వరదనీటికి కోతకు గురైంది.

● నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. అలాగే, నర్సాపూర్ నుంచి కొండాపూర్, కాగజ్‌మద్దూర్ మీదుగా పటాన్‌చెరుకు వెళ్లే రోడ్డు ఏళ్ల నుంచి గుంతలతో నిండి ఉంది. ఆర్టీసీ బస్సులను ఈ రోడ్డుపై నడపలేక ఆపేశారు.

● చేర్యాల: చేర్యాల పట్టణ శివారులోని బాలాజీ కళామందిర్ చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ వరకు గల బైపాస్‌రోడ్డు పూర్తిగా మట్టితో అధ్వానంగా మారింది. ఈ దారిలో గుంటూరుపల్లితో పాటు ఆకునూరు, ధూళిమిట్ట, నంగునూరు, మద్దూరు, హుస్నాబాద్, జనగామ, నర్మెట్ట మండలాలకు ప్రయాణిస్తుంటారు. ఇదే రోడ్డుపై మున్సిపల్, ఎస్టీవో, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏడీఈ కార్యాలయం, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు జరగలేదు. ఇటీవల మున్సిపల్ అధికారులు గుంతల్లో మట్టి మొరం పోయించినా, వర్షాలకు బురదగా మారుతోంది. శాశ్వత ప్రాతిపదికన రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● కొమురవెల్లి: కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ, హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను వాహనదారులు గుర్తించేలా స్థానికులు ఎర్రజెండాను ఏర్పాటు చేశారు.



నర్సాపూర్‌లోని హన్మంతాపూర్ రోడ్డు



నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద గతుకులమయంగా మారిన రోడ్డు



నారాయణఖేడ్ శివార్లలోని మనూరు రోడ్డు



చేర్యాలలో మట్టి,మొరంతో బైపాస్‌రోడ్డు



హల్దీ వాగు ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే

తూప్రాన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో హల్దీ వాగుపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. మూడు రోజుల నుంచి వాగు ఉధృతంగా ప్రవహించగా, కాజ్‌వే కింద వేసిన మట్టి కొట్టుకుపోయి సీసీ ముక్కలై రోడ్డు తెగిపోయింది. దీంతో తూప్రాన్ పట్టణం నుంచి గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి, సిద్దిపేట జిల్లాలోని మాచినపల్లి, ఇందుప్రియాల్‌తో సహా పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

గణనాథుడి ఆగమనం

వినాయక విగ్రహాలు మండపాలకు చేరుకుంటున్నాయి. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి గణనాథుల రాక మొదలైంది. సంగారెడ్డిలోని నేతాజీ నగర్‌లోని హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భారీ గణనాధుడిని గురువారం రాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రత్యేక కళాకారుల డప్పుచప్పుళ్లు, బ్యాండ్‌బాజా, నృత్యాలతో విద్యుత్ కాంతుల మధ్య మండపం వరకు నిర్వహకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు.

-సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి)





భవానీ దీక్షాధారులతో సంగ్రాం మహరాజ్

ప్రతీ మానవుడు భక్తి మార్గం వైపు పయనించాలి : సంగ్రాం మహరాజ్

కల్హేర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మానవుడు భక్తి మార్గం వైపు పయనిస్తే జీవితం ధన్యమవుతుందని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, ఆలిండియా సాధు సంతుల సంఘం తెలంగాణా ప్రతినిధి సంగ్రాం మహరాజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బల్కం చెల్కాతండాలో గురువారం 40 మంది గిరిజనులకు ఆయన భవానీ మాతా దీక్షధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహభాషణం చేస్తూ తండాల్లో భవానీ మాతా దీక్షలు చేపట్టడం ఎంతో సంతోషకరమని, ఈ దీక్షలతో వారి జీవితాల్లో ఎంతో మార్పు వస్తుందని అన్నారు.

వృద్ధులను గౌరవించడం మన బాధ్యత

● సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను గౌరవించడం మన బాధ్యతగా భావించి వారి బాగోగులు చూసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని ది గ్రేస్ వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేసి, వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 సీనియర్ సిటిజన్ దినోత్సవం లక్ష్యం.. వృద్ధుల స్వరాలను శక్తివంతం చేయడం, వారి అనుభవాలు, జ్ఞానాన్ని గుర్తించి విస్తరింపజేయడమేనని ఆమె తెలిపారు. వృద్ధాశ్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, న్యాయపరమైన అంశాల్లో ఉచిత సహాయం అవసరమైనవారు సంగారెడ్డిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ తనిఖీల్లో వృద్ధాశ్రమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

ఆలోచనల నుంచి వాస్తవికత వైపు గీతం విద్యార్థులు

ఆచరణాత్మక అనుభవం పొందిన ఆర్కిటెక్చర్ స్టూడెంట్స్

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డిజైన్ ఆలోచనలు, భావనలు నిర్మాణ వాస్తవికతగా ఎలా రూపాంతరం చెందుతాయో గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఇటీవల సికింద్రాబాద్‌లోని ఒక ప్రముఖ ఆర్కిటెక్ట్ నివాసాన్ని సందర్శించి, కేస్ స్టడీలా అధ్యయనం చేశారు. వాతావరణానికి అనుగుణంగా రూపొందించిన నిర్మాణం, సమర్థవంతమైన ప్రదేశాల ప్రణాళిక, నిర్మాణ సామగ్రి వినియోగం, నిర్మాణంలోని సూక్ష్మ నైపుణ్యాలను విద్యార్థులు నిశితంగా పరిశీలించారు. ఆర్కిటెక్ట్‌తో నేరుగా మాట్లాడటం వల్ల డిజైన్ భావనలు నిర్మాణంగా ఎలా మారతాయో వారు స్వయంగా తెలుసుకున్నారు. తమ పరిశీలనలను స్కెచ్ పుస్తకాల్లో నమోదు చేసుకుని, తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంత జ్ఞానాన్ని క్షేత్రస్థాయి విశ్లేషణతో పోల్చి చూశారు. ఈ అనుభవం విద్యార్థుల సాంకేతిక అవగాహనను పెంచడమే కాకుండా, వాస్తుశిల్పంలోని సృజనాత్మక కోణాలను కూడా అర్థం చేసుకునేలా ప్రేరేపించింది.

చౌటకూర్‌కు సిబ్బంది కేటాయింపు

● తహసీల్ కార్యాలయానికి 13 మంది

● ఐదేళ్లుగా డిప్యూటేషన్ అధికారులతో నిర్వహణ

● త్వరలో రెగ్యులర్ సిబ్బంది నియామకం

పుల్కల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ రెవెన్యూ మండలానికి సిబ్బందిని కేటాయిస్తూ ప్రధాన కమిషనర్, భూ పరిపాలన శాఖ (సీసీఎల్‌ఏ) ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 2020 జూలైలో 13 రెవెన్యూ గ్రామాలను కలిపి చౌటకూర్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్‌తో పాటు ఇతర సిబ్బంది డిప్యూటేషన్ మీద విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు ఐదేళ్లుగా ఇతర మండలాల్లో రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన రెండు రెవెన్యూ డివిజన్లు, 15 రెవెన్యూ మండలాలకు కేడర్ స్ట్రెంత్‌ను కేటాయించింది. ఇందులో చౌటకూర్‌ను చేర్చుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం పంపింది. మొత్తం 13 మంది సిబ్బందిలో తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్, ఇద్దరు ఎంఆర్ఐలు-2, ఒక్కొక్క సీనియర్, జూనియర్ సహాయకులు ఉంటారు. వీరితో పాటు టైపిస్టు, సర్వేయర్, ఏఎస్ఓ, ఆఫీస్ సబార్డినేట్, ముగ్గురు వాచ్‌మెన్-3, చైన్‌మెన్ పోస్టులను మంజూరు చేశారు. త్వరలో రెగ్యులర్ సిబ్బందిని నియమించనుండటంతో మండలంలో రెవెన్యూ పరిపాలన సజావుగా సాగనుంది. కాగా, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న నిజాంపేట మండలానికి మాత్రం సిబ్బంది కేటాయింపులు చేయలేదు.



చౌటకూరు మండల తహసీల్దార్ కార్యాలయం

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

● క్విక్ రియాక్షన్ టీంలతో పటిష్ట బందోబస్తు

● ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి : ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండుగలు ఒకేసారి వస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేసి త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని, లౌడ్‌స్పీకర్లు పరిమిత స్థాయిలో వాడేలా చూడాలన్నారు. గంజాయి స్మగ్లర్లపై నిఘా ఉంచాలని, విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అన్ని మతాలకు చెందిన పవిత్ర స్థలాలు, పరిశ్రమల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. విచారణ కేసుల్లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపించాలని సూచించారు. పోక్సో, అత్యాచార కేసులలో వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని, అందుకు భరోసా సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



న్యాయవాదులకు సన్మానిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

న్యాయవాదులకు సన్మానం

వివిధ కేసులలో నిందితులకు జీవిత ఖైదు పడేలా వాదనలు వినిపించిన పీపీ శైలజ, విజయ్ శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేశ్వర్, సూర్‌రెడ్డిను ఎస్పీ పంకజ్ సత్కరించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సత్యగౌడ్, ప్రభాకర్, సైదానాయక్, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరభారతీయులతో తెలంగాణకు ప్రమాదం

● పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో మన ఉనికికే ప్రమాదం : జాగో తెలంగాణ

జహీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరభారతీయుల ప్రభావంతో స్థానికులు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని జాగో తెలంగాణ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణలో ఉత్తరభారతీయులు చేసే వ్యాపారాలు కల్తీమయంగా ఉన్నాయని, నకిలీ వస్తువులను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వారి తినుబండారాల్లో కల్తీ ఎక్కువగా ఉండటంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడి ఆసుపత్రుల పాలై ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో, వ్యాపార రంగాల్లో వారి ఆధిపత్యం పెరిగి స్థానికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నకిలీ, నాసిరకం వస్తువులను విక్రయిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో తెలంగాణ వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో స్థానిక వనరులను వినియోగిస్తున్నప్పుడు స్థానిక వాటా కింద ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు అన్ని రంగాల్లో మోసానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా మేల్కోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. మార్వాడీ గో బ్యాక్ అంటూ జహీరాబాద్‌లో నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాగో తెలంగాణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాగో తెలంగాణ నాయకులు రాములు నేత, మాదీనం శివప్రసాద్, దశరథ్, ఇమ్రాన్, కిరాణా వర్తక సంఘం నాయకులు సంతోష్, అశోక్ బాబా, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాగో తెలంగాణ నాయకులు

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాలలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో భాగంగా సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం (ఎస్‌బీఐఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గల యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 29 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. 13 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ కిట్లు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9490103390, 9490129839 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్

నర్సాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

నేటి నుంచి పనుల జాతర

కంది, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి పథకం ద్వారా నేటి నుంచి ఉపాధిహామీ పనుల జాతర జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కంది మండలంలోని చేర్యాలలో అంగన్‌వాడీ భవనం, ఎర్దనూర్ తండాలో జీపీ భవనం మంజూరయ్యాయని చెప్పారు. ప్రత్యేక అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో భవన నిర్మాణాలకు భూమిపూజ చేయనున్నట్లు ఆయన వివరించారు.

● మనోహరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమం నేడు ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామని మనోహరాబాద్ ఎంపీడీవో రవీందర్ తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా ఇందిరా మహిళా శక్తి-ఉపాధి భరోసా కార్యక్రమం కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

దురుసుగా ప్రవర్తించిన గైనకాలజిస్టుపై ఫిర్యాదు

జోగిపేట రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ తస్లింపై ఓ గర్భిణి ఫిర్యాదు చేసింది. జోగిపేటకు చెందిన గర్భిణి సాయి భవాని తన ఆరోగ్య సమస్యను వైద్యురాలికి వివరించగా, ఆమె దురుసుగా మాట్లాడారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన తర్వాత అక్కడి వైద్యులు తిరిగి జోగిపేట ఆసుపత్రికి పంపగా, వైద్యురాలు కోపంగా మాట్లాడి, పోలీసులకు ఫోన్ చేస్తానని బెదిరించారని సాయిభవాని తెలిపారు. దీంతో ఆమె భర్త డీసీహెచ్ఎ‌స్ సంగారెడ్డికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కోరారు.

28 నుంచి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

పాపన్నపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు పాపన్నపేట ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రతాప్ రెడ్డి తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలు ఉంటాయని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

●మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో సీఐ మహేష్ అధ్యక్షతన జరిగిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీజే సౌండ్స్ పరిమితికి మించి ఉండకూడదని, ఎలాంటి గొడవలు లేకుండా శోభాయాత్ర నిర్వహించాలని కోరారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాగితాల్లోనే స్టాక్.. దుకాణాల్లో నిల్

(5వ పేజీ తరువాయి)

ప్రశ్నించారు. ధర్నాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేట, చిన్నశంకరంపేట మండలం మడూరులోనూయూరియా కోసం రైతులు ఎగబడ్డారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు : కలెక్టర్

రామయంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే ఫర్టిలైజర్స్ దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. మండల పరిధి తొనిగండ్లలో నానో యూరియా వాడకాన్ని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం రామాయంపేట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌కు కావాల్సినంతగా యూరియా వచ్చిందన్నారు. కొరత ఉందనే వదంతులతో రబీ సీజన్ కోసం ముందస్తుగా కొనుగోలు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. యూరియా కోసం రైతులకు అవసరం లేని ఎరువులు అంటగడితే వ్యాపారులపై చర్యలు తప్పవన్నారు. మరోవైపు, యూరియా కావాలని రైతులు గురువారం రామయంపేటలో రాస్తారోకో చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.

వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు

మనూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి);మండల పరిధిలోని రాయిపల్లిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వీధుల్లో గుంపులుగా కుక్కలు సంచరించడంతో ప్రజలు భయటకు రాలేని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో గ్రామంలోని చాలా మందిపై కుక్కలు దాడిచేసి కరిచాయని వాపోయారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి కూడా జంకుతున్నారని ఎంపీపీ కోఆప్షన్ మాజీ సభ్యుడు సలీం తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రాయిపల్లిలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి క్రీడలు

● అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి మూడు రోజుల పాటు పటాన్‌చెరులో రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల్లో గెలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా కృషి చేయాలని కోరారు. అలాగే, వచ్చే నెల 8న ప్రభుత్వ ఉపాధ్యాయులకు, 13న ప్రైవేటు ఉపాధ్యాయులకు గురుపూజోత్సవం నిర్వహించి సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు పీపీరరాథోడ్, నాగేశ్వరరావునాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో గురువారం 180 మంది లబ్ధిదారులకు రూ.1.8 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా పేదలు కూడా ఉన్నత వర్గాలతో సమానంగా పెళ్లిళ్లు చేసుకోగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్పా నాగేశ్, మాజీ సర్పంచులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమీక్ష

దైవ చింతనతోనే మనసుకు ప్రశాంతత

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

హవేళిఘణపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం మండలంలోని శాలిపేట గ్రామంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో మెదక్‌లో పాలకులు ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిస్తున్నామని, చెప్పిన మాట నిలబెట్టుకునే తత్వం తమదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు లక్ష్మీనారాయణ, పోశెట్టి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



శాలిపేటలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

ఎఫ్‌సీఐ కార్యాలయాన్ని మెదక్‌కు తరలించాలి

● ఎంపీ రఘునందన్‌రావుకు బీజేపీ నేతల వినతి

మెదక్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి మెదక్‌కు తరలించాలని బీజేపీ నేతలు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఢిల్లీలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యాలయం దూరంగా ఉండటం వల్ల రైతులు, మిల్లర్లు, రేషన్ డీలర్లు ప్రయాణ ఖర్చులతో పాటు సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు.



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

పీఎంకేఎస్‌వై ప్రతిపాదనలు మంజూరు చేయాలి

● కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

నారాయణఖేడ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) ప్రాజెక్టు ప్రతిపాదనలను మంజూరు చేయించాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. వర్షపాతంపై ఆధారపడిన సంగారెడ్డి జిల్లా రైతుల కోసం ఈ ప్రాజెక్టు చాలా ముఖ్యమని తెలిపారు.





వెల్దుర్తిలో తేజస్వికి ట్రై సైకిల్, వినయ్‌కుమార్‌కు ఆర్టిఫిషియల్ లింబ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వీల్‌చైర్‌లు, కృత్రిమ అవయవాలు అందజేత

వెల్దుర్తి /చేగుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం కుకునూరు ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న తేజస్వికి ట్రై సైకిల్, 10వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్‌కు ఆర్టిఫిషియల్ లింబ్‌ను శ్రీరామనుజ సేవా ట్రస్ట్ అందజేసింది. గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీఈవో రాధాకిషన్, ఎంఈవో సీతారం హాజరై అందజేశారు. శ్రీరామనుజ సేవ ట్రస్ట్ తరఫున తేజస్విని దత్తత తీసుకుని ఆమె చదువు ఖర్చులను భరిస్తామని ఫౌండర్ డాక్టర్ ధనుంజయ్ తెలిపారు. అలాగే నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సిద్దిరాములుకు సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ, సభ్యులు వీల్‌చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు, నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయండి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖాధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులు పూర్తి చేయాలని, కొత్త రోడ్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే, వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ వెల్ఫేర్, వసతి గృహ సంక్షేమాధికారులకు సూచించారు. అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని అధికారులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ ఈఈ యుగేందర్, డీఈలు దీపక్, సుభాష్, బీసీ వెల్ఫేర్, వసతి సంక్షేమాధికారులు కృష్ణ కవిత, మంజుల, గౌస్ హుస్నీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

మానవ అక్రమ రవాణా నిర్మూలన మనందరి బాధ్యత

● రాష్ట్ర విద్యాశాఖ మానిటరింగ్ ఆఫీసర్ బాలయ్య

కంది, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న నేరపూరిత చర్య అని, దీనికి పేద, మధ్యతరగతి మహిళలు, అమ్మాయిలు ఎక్కువగా గురవుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మానిటరింగ్ ఆఫీసర్ బాలయ్య అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా కంది జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. సైబర్ ట్రాఫికింగ్ చాలా వేగంగా విస్తరిస్తోందని, విద్యార్థులు ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనవసరమైన యాప్‌ల ద్వారా పర్సనల్ ఫొటోలు, వీడియోలు పంపడం వల్ల సెక్స్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజ్వల సంస్థ ఇప్పటివరకు 30 వేల మంది మహిళలను, అమ్మాయిలను కాపాడిందని తెలిపారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో జోగప్ప, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలి రాజ్, భూపాల్, రమాదేవి సంగారెడ్డి జిల్లా స్కూల్ అసిస్టెంట్, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న బాలయ్య

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పాశమైలారంలో సర్వే నిర్వహించారు. అనేక పరిశ్రమల్లో లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్ వంటి సదుపాయాలు లేవని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు, సుధాకర్, వెంకటేష్. రోషన్, శ్రీనివాస్, దుర్గయ్య, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడుతున్న మాణిక్

బదిలీలల రూటే సప‘రేటు’

(5వ పేజీ తరువాయి)

అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇందుకు సహకరించిన కార్యదర్శులను అదే ప్రాంతంలో దీర్ఘ కాలం ఉండేలా చూస్తున్నారు. కథనం వెల్లడించింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల మధ్య బదిలీలకు కూడా డబ్బులు చెల్లిస్తున్నారని, మున్సిపాలిటీలోకి మారడం ఇష్టం లేని వారికి డబ్బులు వచ్చే గ్రామాల్లో పోస్టింగ్ ఇస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వం ఇంకా మున్సిపాలిటీల్లోకి మారతారా, పంచాయతీల్లోనే ఉంటారా అనే ఆప్షన్ ఇవ్వకముందే ఈ బదిలీలు జరుగుతున్నాయని తెలుస్తున్నది.

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటి పరిధిలోని ఓ గ్రామంలో పనిచేస్తున్న కార్యదర్శి నిబంధనల ప్రకారం 180 రోజులు ప్రసూతి సెలవులు తీసుకున్నారు. పూర్తయిన తరువాత అదే స్థానంలో రిపోర్టు చేయడానికి వెళ్లగా వేరే వాళ్లు విధి నిర్వహణలో ఉన్నారు. ఆమెను వేరే ప్రాంతానికి బదిలీ చేయబోగా తీవ్రంగా ప్రతిఘటించడంతో విధిలేని పరిస్థితిలో అదే పోస్టు ఇచ్చారు.

మరో మున్సిపాలిటీ పరిధిలోని మహిళా కార్యదర్శి సైతం ప్రసూతి సెలవుల అనంతరం విధుల్లోకి చేరడానికి వెళ్లగా అడ్డుకుని ప్రాధాన్యత లేని గ్రామానికి పంపారు. నారాయణఖేడ్, న్యాల్‌కల్, జహీరాబాద్, ఆందోలు ప్రాంతాల్లో పనిచేస్తున్న నలుగురు కార్యదర్శుల నుంచి పెద్దఎత్తున ముడుపులు తీసుకొని అక్రమార్జన ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో ఓ కార్యదర్శి పోస్టును వేలం పెట్టి రూ.20లక్షలు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

మహాధర్నాను విజయవంతం చేయాలి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ధర్నా కరపత్రాన్ని సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆవిష్కరించారు. పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏ విడుదల చేయాలని, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య యాదవ్, లక్ష్మారెడ్డి, అశోక్‌కుమార్, సోమశేఖర్, సాయిలు, రాంచందర్ పాల్గొన్నారు.

జాగిలాలతో తనిఖీలు

చేగుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండల కేంద్రంలో పోలీస్ ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టారు. గురువారం మండల కేంద్రంలో ఎస్సై సృజన ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం దాబా హోటల్లో, కిరాణా షాపులలో, పాన్ షాప్‌లో గంజాయి మత్తు పదార్థాలు మద్యం అక్రమ నిల్వలు పసిగట్టెందుకు జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో అక్రమ గంజాయి రవాణా మత్తుపదార్థాలు ఎక్కడైనా నిలువ ఉన్న అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమంగా నిల్వలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి పేరు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

● చిన్నశంకరంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిన్నశంకరంపేట పోలీసులు గురువారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టారు. మండలంలోని షాపులు, హోటళ్లు, రైల్వే స్టేషన్‌లో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వాడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నారాయణగౌడ్ హెచ్చరించారు.

రోడ్డు బాగు చేయాలని ఆందోళన

హత్నూర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శేర్కానపల్లి-నత్నయపల్లి ప్రధాన రోడ్డును వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేస్తూ హత్నూర ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో బస్సులు కూడా రద్దు అయ్యాయని, దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవోకు ఇచ్చిన వినతిపత్రంలో రోడ్డు మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేశ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలపై మైనింగ్ అధికారుల దాడులు

చిన్నశంకరంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు, మెటీరియల్ రవాణా చేస్తున్న వారిపై మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి జరిమానాలు విధించారు. శివ్వంపేట మండలం కొత్తపేటకు చెందిన రెండు ట్రాక్టర్లకు రూ.40 వేలు, గజ్వేల్ నుంచి వస్తున్న ఒక టిప్పర్‌కు రూ.22,328 జరిమానా విధించారు. ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మైనింగ్ అసిస్టెంట్ జియాలజిస్ట్ మధుకుమార్ హెచ్చరించారు. జిల్లా మైనింగ్ శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ ఉన్నారు.

నేడు, రేపు జాతీయ సదస్సు

మెదక్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22, 23 తేదీలలో ఈ-గవర్నెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సదస్సు మీడియా కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ గోపరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న బెల్ ఫ్లైఓవర్ కింద రక్తగాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న సుమారు 40 ఏళ్ల వ్యక్తిని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఎండు గంజాయి అమ్ముతున్న జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి వంద గ్రాముల గంజాయితో పాటు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడు అరుణ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

చిలప్‌చెడ్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో నిర్వహించనున్న అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈవో విఠల్ కోరారు. చిట్కుల్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపిస్తామని తెలిపారు.

అడవి పంది దాడిలో నలుగురికి గాయాలు

వట్‌పల్లి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : అడవి పంది దాడిలో నలుగురు గాయపడ్డారు. మండల పరిధిలోని పోతులబొగుడ గ్రామ సమీపంలోని పంట చేనులో గురువారం ముగ్గురు ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా వారిపై అడవి పంది దాడి చేసింది. అలాగే గ్రామంలోకి వెళ్లి ఇంటి బయట కూర్చున్న మరో వ్యక్తిపై కూడా దాడి చేసింది. ఈ ఘటనలో చిలివేరా కిష్టయ్య(65)కు కాలు విరగడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గురు టేక్మాల్ నాగరాజు, బేగరి ప్రదీప్, వసంత స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.